
ఏం తినేటట్టు లేం.. ఏం కొనేటట్టు లేం అన్న చందంగా ఉంది కూరగాయల ధరలు. రోజు రోజుకు కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే దాదాపు అన్ని రకాల ధరలు రెట్టింపయ్యాయి. ఇప్పటికే నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని తాకుతుంటే..పెరిగిన కూరగాయల ధరలు సామాన్యుడి నడ్డి విరుస్తున్నాయి. అధికారంలోకి వస్తే నిత్యావసరాల ధరలు తగ్గిస్తామని కూటమి నేతలు ఊదరగొట్టారు. తీరా అధికారంలోకి వచ్చాక ధరల నియంత్రణలో **కూటమి ప్రభుత్వం చెతులెత్తేసింది. దీంతో ధరల పెరుగుదలతో సామాన్యులు విలవిల్లాడుతున్నారు.**

– అల్లిపురం

ధర..దడ











వేంకటేశ్వరమెట్టకు చెందిన సత్యనారాయణ ఓ ప్రైవేటు కంపెనీలో క్లర్క్‌గా పని చేస్తున్నాడు. నెలకు రూ.15వేలు జీతం. భార్య, కొడుకు, కుమార్తెతో జీవిస్తున్నాడు. అతనికి వచ్చే కొద్దిపాటి జీతంతో నెల సరిపడా బడ్జెట్ వేసుకుని జాగ్రత్తగా డబ్బు ఖర్చు చేస్తుంటాడు. అందులోనే ఇంటి అద్దె, మందులు, నెలవారి సరుకులు, గ్యాస్, పిల్లల స్కూల్ ఫీజులు, వారం వారం ఖర్చులు చూసుకుంటుంటాడు. మిగిలింది భవిష్యత్ అవసరాలకు పొదుపు చేసుకుంటున్నాడు. నిత్యావసరాల ధరలు పెరగడంతో బడ్జెట్ అదుపు తప్పింది. ఎంతో కష్టంగా నెట్టుకొస్తున్నాడు.

నేరెళ్ల కోనేరు ప్రాంతానికి చెందిన శంకరరావు నగరంలో ఓ కంపెనీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. నెలకు రూ.20 వేలు నెలవారీ సంపాదన వస్తుంది. అందులోనే భవిష్యత్ అవసరాలకు కొంత పొదుపు చేసుకుంటూ, కుటుంబ అవసరాలను తీర్చుకుంటున్నారు. ఒక్కసారిగా ధరలు పెరగడంతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు.

ఇప్పుడే ఇలా ఉంటే రానున్న రోజులు పండగలు, ఆధ్యాత్మిక రోజులు కావటంతో ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని సామాన్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఏ కూరగాయ కొందామన్నా కేజీ రూ.50 పైబడే ఉంటున్నాయి. ఉల్లిపాయలు కేజీ రూ.60, టామాటా అయితే రైతు బజారులోనే రూ.60 దాటింది. అల్లిపురం మహాత్మాగాంధీ మార్కెట్‌లో కేజీ రూ.100 వరకు అమ్ముతున్నారు. నగరంలో అన్ని ప్రాంతాలలో రైతుబజార్లు అందుబాటులో ఉన్నాయి. దక్షిణ నియోజవర్గంలో ఒక్క రైతు బజారు కూడా అందుబాటులో లేక పోవటంతో అధిక ధరలు పెట్టి కొనే పరిస్థితి దక్షిణ నియోజకవర్గం ప్రజలకు తప్పటం లేదు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా కూరగాయల పంటలు దెబ్బతిన్నాయని, దిగుబడి బాగా తగ్గడంతో రైతులే ధరలు పెంచి అమ్ముతున్నారని వ్యాపారులు చెబుతున్నారు. తాము తీసుకువచ్చిన కాయగూరలలో వేస్ట్, పాడైనవి తీసివేయగా మిగిలిన కూరగాయలను తమ అసలు పోను తక్కువ మార్జిన్‌కి అమ్ముకోకపోతే తమకు నష్టం వస్తుందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన ధరలతో కూరగాయలు కొనుగోలు చేయలేకపోతున్నామని వినియోగదారులు వాపోతున్నారు.

నిత్యావసర సరుకులిదే అదేపరిస్థితి

కూరగాయల పరిస్థితి అలా ఉంటే నిత్యావసర వస్తువులు అయిన పప్పులు, వంట నూనెల పరిస్థితి అలానే ఉంది. గత ప్రభుత్వం కంటే అధిక ధరలు అధికంగా ఉన్నాయని.. పేద, మధ్య తరగతి ప్రజలు కనీసం పప్పునీళ్లు కూడా తాగి బతికే పరిస్థితి కానరాలేదని వాపోతున్నారు.



అల్లిపురం మహాత్మాగాంధీ మార్కెట్‌లో కాయగూరలు దుకాణం

రూ.500 పెడితే సంచికూడా నిండటం లేదు



బజారుకు రూ.500లు తీసుకువెళితే కనీసం సంచి కూడా నిండటం లేదు. ఏ కూరగాయ చూసినా మినిమం రూ.40 కిలో ఉంటుంది. గతంలో పది రకాల కూరగాయలు, పండ్లు కొనుగోలు చేసేవాళ్లం. ఇప్పుడు నాలుగు రకాల కూరగాయలు కొనేసరికి డబ్బులు అయిపోతున్నాయి. సంచి సగం కూడా నిండటం లేదు. ఇది మాలాంటి మధ్య తరగతి ప్రజలకు చాలా కష్టంగా ఉంది. ఏం కొనలేకున్నాం..ఏం తినలేకున్నాం.

– నీలి అమరావతి, న్యాయవాది

పప్పు ధరలు అంతే



కూరగాయల ధరలు చూసి కొనేపరిస్థితి లేదు. అన్ని కూడా రూ.50కు పైగానే ఉంటున్నాయి. ఇప్పటికిప్పుడు ధరలు అందుబాటులోకి వస్తాయన్న ఆశ కూడా లేదు. వర్షాలతో పంట నష్టం ఏర్పడిందని, అందుకే అధిక ధరలకు విక్రయిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. రేషన్ సరుకుల ధరలు కూడా అదుబాటులో లేవు. కిరాణా షాపునకు వెళితే కిలో కందిపప్పు కిలో.రూ.180 ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో మాలాంటి మధ్యతరగతి వాళ్లం ఏమి తిని బతకాలి.

– పి.సంజీవరావు, అల్లిపురం

వర్షాల వల్లే..



ఇటీవల కురిసిన వర్షాల వల్ల పంటలు పూర్తిగా నష్టపోయింది. దీంతో దిగుబడి తగ్గిపోయింది. ఉన్న పంట కూడా చీడ పీడలతో కొంత పాడయింది. పెట్టుబడి కూడా రావటం లేదు. కూలీ చార్జీలు పెరిగాయి. ఆటోలకు చార్జీలు పెంచేశారు. చేతికొచ్చిన పంట అమ్ముకుందామంటే గిట్టుబాటు ధర ఉండటం లేదు. దీంతో ధరలు పెంచాల్సి వస్తుంది. తుమ్మపాల నుంచి అల్లిపురం తీసుకువచ్చి అమ్ముతున్నాను.

– మళ్ల లక్ష్మి, రైతు, వ్యాపారి, తుమ్మపాల

క్లుప్తంగా

మర్యాదపూర్వక కలయిక



బొత్సను కలిసిన వాసుపల్లి

దాబాగార్డెన్స్: ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణను శనివారం మాజీ ఎమ్మెల్యే, విశాఖ దక్షిణ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలో ఎదుర్కొంటున్న రాజకీయ పరమైన అంశాలపై చర్చించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి, వైఎస్సార్ సీపీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించారు. భవిష్యత్‌లో వైఎస్సార్ సీపీ పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు కృషి చేస్తామని వాసుపల్లి గణేష్‌కుమార్ తెలిపారు.

మొండిబకాయిలు వసూలు చేయండి



మాట్లాడుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

జగదాంబ: జోన్ పరిధిలో రెవెన్యూ వసూళ్ల వేగవంతం చేయాలని జీవీఎంసీ జోన్–4 కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు సిబ్బందిని ఆదేశించారు. శనివారం ఆయన సూర్యాబాగ్ జోనల్ కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు, సెక్రెటరీలకు, ట్యాక్స్ కలెక్టర్లలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల వారీగా ఆర్ఐలు సిబ్బంది రెవెన్యూ వసూళ్లు చేపట్టాలన్నారు. ముందుగా టార్గెట్‌లు తీసుకుని వసూల్ చేసి జీవీఎంసీకి ఆదాయం పెంచాలన్నారు. పాతబకాయిలు, మొండిబకాయిదారులకు నోటీసులు జారీ చేయాలన్నారు. అప్పటికీ చెల్లించని పక్షంలో ఆస్తి జప్తు నోటీసలు జారీ చేయాలన్నారు.

అద్దేపల్లి సుభద్రమ్మ మృతి



దాబాగార్డెన్స్: ప్రముఖ వ్యాపారవేత్త, హోటల్ మర్చంట్స్ అసోసియేషన్ సభ్యుడు, సాగర్ లాడ్జి అధినేత ఏఈపీఎస్ మూర్తి మాతృమూర్తి అద్దేపల్లి సుభద్రమ్మ(90) శనివారం కలెక్టర్ ఆఫీస్ సమీపాన గల వారి స్వగృహంలో మృతి చెందారు. పది రోజులుగా అస్వస్థతకు గురైన ఆమె ఇంట్లోనే కాలం చేశారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె. కాన్వెంట్ జంక్షన్ హిందూ శ్మశాన వాటికలో సాయంత్రం సంప్రదాయ రీతిన అంత్యక్రియలు జరిపారు. ఆమె మృతికి అన్నమాచార్య భావనవాహిని వ్యవస్థాపకురాలు డాక్టర్ శోభారాజు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, విశాఖకు చెందిన వివిధ హోటల్స్ అధినేతలు, ఆర్యవైశ్య సంఘాల ప్రతినిధులు సంతాపం తెలిపారు.

అల్పాహారం, రాగిజావ పంపిణీ



పారిశుధ్య కార్మికులకు అల్పాహారం, రాగిజావ అందజేస్తున్న సూరాడ అప్పారావు తదితరులు

దాబాగార్డెన్స్: స్థానిక స్వామి వివేకానంద సంస్థ సభ్యులు శనివారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గమ్మను దర్శించుకుని, అక్కడి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అల్పాహారం, రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులు అందిస్తున్న సేవలు ఎనలేనివని, వారికి ఈ విధంగా అమ్మవారి సన్నిధిలో నారాయణసేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. అరుణాచలం పుణ్యక్షేత్రం వద్ద కూడా అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. అన్నదాన కార్యక్రమానికి సహాయమందించిన డాక్టర్ సీఎంఏ జహీర్ అహ్మద్, మట్టపల్లి హనుమంతరావు, ద్రోణంరాజు శ్రీవత్సవ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వైద్య ఖర్చులకు రూ.10వేల ఆర్థిక సాయం



05వీఎస్‌సీ217-320058:ఆర్థిక సాయం అందజేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 30వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ఆకుల శ్యాంకుమార్ సతీమణి రోజారాణికి వైద్య ఖర్చుల కోసం మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ శనివారం రూ.10వేల ఆర్థిక సాయం అందజేశారు. ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లోని వాసుపల్లి కార్యాలయంలో ఈ సాయం అందజేసి భరోసా కల్పించారు. దక్షిణ నియోజకవర్గ ప్రజలకే గాక తనతోపాటు అండగా నిలుస్తూ పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్న కార్యకర్తలంతా తన కుటుంబ సభ్యులేనని, వారి కష్టాల్లో అండగా ఉంటానని వాసుపల్లి హామీనిచ్చారు. బాధితురాలు మాట్లాడుతూ ఏ కష్టం వచ్చినా గుర్తొచ్చే వాసుపల్లి గణేష్‌కుమార్ తమకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించడంపై కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వద్దాది దిలీప్, గురజాపు రవి, వేణు, కోరాడ సురేష్ పాల్గొన్నారు.

23న ఏపీ నర్సింగ్ అసోసియేషన్ ఎన్నికలు

మహారాణిపేట: ఎట్టకేలకు ఏపీ నర్సింగ్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. రాష్ట్ర ఎన్నికల అధికారిగా డాక్టర్ శ్రీనివాసరెడ్డిని నియమించింది. మూడు సంఘాల మధ్య విబేధాలు కారణంగా నాలుగేళ్లుగా ఎన్నికలు జరగలేదు. దీంతో సభ్యుల వినతి మేరకు మూడు గ్రూపులతో శ్రీనివాసరెడ్డి సమావేశాలు నిర్వహించిన అనంతరం ఎన్నికలు నిర్వహించడానికి ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించారు. సోమవారం నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. 8న ఓటర్ల జాబితా ప్రదర్శిస్తారు. 14న తుది ఓటర్ల జాబితాతో పాటు.. ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారు. జిల్లాకు సంబంధించి కో–ఆపరేటివ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ రిజిస్టర్ బి.శ్రీనివాస్‌ను ఎన్నికల అధికారిగా నియమించారు. ఏపీ నర్సింగ్ అసోసియేషన్ జిల్లాలో పోటీ చేసేందుకు సభ్యులు విధిగా ఇప్పటికే ఐదేళ్ల పాటు సభ్యత్వం చెల్లించిన వారు మాత్రమే అర్హులుగా పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఈ ఎన్నికలకు సంబంధించి 16న నామినేషన్లు, 17న పరిశీలన, 18న ఉపసంహరణ, 23న ఎన్నికలు నిర్వహించనున్నారు. అదే రోజు ఫలితాలు వెల్లడించనున్నారు.

ఆక్రమణలు తొలగించిన ట్రాఫిక్ పోలీసులు



రోడ్డుపై పరికరాలు తొలగించాలని ఆదేశిస్తున్న ట్రాఫిక్ ఎస్.ఐ లక్ష్మి

అల్లిపురం: నేరెళ్లకోనేరు సీపీఐ కార్యాలయం నుంచి హరిత లాడ్జి వరకు ఆటో టింకరింగ్, పెయింటింగ్ వర్కర్సు రోడ్డును ఆక్రమించటంతో టూటౌన్ ట్రాఫిక్ పోలీసులు శనివారం వాటిని తొలగించారు. రోడ్డుపై పాదచారులు, వాహనాలు నడిచేందుకు వీలుగా ఆక్రమణలు ఖాళీ చేయాలని ట్రాఫిక్ ఎస్.ఐ లక్ష్మి దుకాణదారులకు సూచించారు. తరచూ పదే పదే చెబుతున్నా తీరు మార్చుకోవడం లేదని, ఇకపై దుకాణాలను కూడా తొలగించాల్సి వస్తుందని ఆమె హెచ్చరించారు. రోడ్డు మార్జిన్‌లోపల మాత్రమే పనులు చేసుకోవాలన్నారు. టింకరింగ్, పెయింటింగ్ వంటి పనులు బహిరంగంగా చేయరాదన్నారు. దీని వలన పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి

• 32వ వార్డు పర్యటించిన జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్



జీవీఎంసీ కమిషనర్‌కు తమ సమస్యలు తెలుపుకుంటున్న 32వ వార్డు మహిళలు

అల్లిపురం: జీవీఎంసీ 32వ వార్డులో ప్రధాన సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని జీవీఎంసీ కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ హామీ ఇచ్చారు. శనివారం ఆయన కార్పొరేటర్ కందుల నాగరాజుతో కలిసి వార్డులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన నేరెళ్ల కోనేరు ప్రాంతంలో కొంత వరకు భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఉందని మిగిలిన ప్రాంతానికి భూగర్భ డ్రైనేజీ పొడిగించడానికి చర్యలు తసుకుంటామన్నారు. ఆ ప్రాంతంలో కాలువలు రోడ్లు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, ప్రధాన రోడ్లలో చెట్లు కొమ్మలు పెరిగినందున వాటికి ట్రిమ్మింగ్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏడుగుళ్ళ ప్రాంతంలో 60 కుటుంబాల ప్రజలు జీవిస్తున్నారని, ఇది మురికివాడ ప్రాంతం అయినందున ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రభుత్వం తరపున వారికి శాశ్వత గృహ సముదాయం నిర్మించాలని కార్పొరేటర్ కందుల నాగరాజు కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్పందించిన కమిషనర్ పూర్తి వివరాలతో తనకు నివేదిక ఇవ్వాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. చలువతోట ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న కళ్యాణమండపం గ్రౌండ్ ఫ్లోర్ మాత్రమే ఉందిని, మొదటి అంతస్తు నిర్మాణానికి అనుమతులివ్వాలని కార్పొరేటర్ కోరగా కమిషనర్ పరిశీలిస్తామని హామీనిచ్చారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీరు సత్యనారాయణరాజు, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు, పట్టణ ప్రణాళిక అధికారి ధనుంజయరెడ్డి, ఏసీపీ ఝాన్సీలక్ష్మి, ఉప కార్య నిర్వాహక ఇంజినీరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ జోసెఫ్‌లో సైన్స్ అండ్ టెక్నాలజీపై సదస్సు



సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్ అబ్రహం వర్గీస్

కంచరపాలెం: జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్‌లో మహిళా కళాశాల సెమినార్ హాల్‌లో అధునాతన సైన్స్ అండ్ టెక్నాలజీ అంశాలపై వృక్షశాస్త్రం, బయోటెక్నాలజీ వ్యవసాయ–గ్రామీణ అభివృద్ధి విభాగాల ఆధ్వర్యంలో శనివారం అంతర్జాతీయ సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నావల్ సైన్స్ అండ్ టెక్నాలాజికల్ లాబోరేటరీ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలానుగుణంగా వచ్చిన మార్పులతో విద్యకు మరింత సార్థకత తీసుకురావాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, అతిథులు డాక్టర్ పి.శాంతిలత తదితరులు పలు కళాశాలలకు చెందిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సెమినార్ కన్వీనర్ డాక్టర్ ఎం.పద్మ, సుందరి, కో–కన్వీనర్లు డాక్టర్ ఎ.వీరబ్రహ్మం, ఎల్.ఊర్మిళ, సిస్టర్ హేమ, డాక్టర్ అరుణాదేవి, డాక్టర్ హరిణి, డాక్టర్ జయలక్ష్మి, ఎస్.నాగరాజు, సాయి నిఖిల, డి.శ్వేత తదితరులు పాల్గొన్నారు.

దుర్గాలమ్మకు విశేష పూజలు



శివరామకృష్ణ దేవస్థానంలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన ఉమాదేవి



అల్లిపురం మెయిన్‌రోడ్డు శ్రీ ధనశక్తి దుర్గాదేవి పీఠంలో అమ్మవారు



గాయత్రీదేవిగా దర్శనమిచ్చిన దుర్గాలమ్మ అమ్మవారు

దాబాగార్డెన్స్: నగరంలోని 35వ వార్డు పూర్ణామార్కెట్ వెలంపేటలో వెలసిన దుర్గాదేవి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రుల ఉత్సవాలు శనివారం మూడో రోజుకు చేరుకున్నాయి. అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.భవనీ మాలధారులు పూజ లు జరిపారు. ఆదివారం అన్నపూర్ణాదేవిగా దుర్గాలమ్మ దర్శనమివ్వనున్నారు.

అల్లిపురం: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారు భక్తులకు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. పలు ప్రాంతాల్లో అమ్మవారి దేవాలయాల్లో అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు దీరారు. యారాడ కొండపై వెలసిన సాగర గిరి కనకదుర్గమ్మ దేవాలయం శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయ అర్చకుడు ఫణికుమార్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు చేపట్టారు. అనంతరం అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. టూటౌన్ దరి శ్రీ శివరామకృష్ణ దేవస్థానంలో వెలిసిన ఉమాదేవి అమ్మవారు అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకుడు భార్గవ శర్మ అమ్మవారిని గాయత్రి దేవిగా అలంకరించారు. మెయిన్‌రోడ్డులో గల రాచపోలమాంబ అమ్మవారి శతకం పట్టులో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా ఏర్పాటు చేసిన దుర్గమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు నిర్వహించారు. బంగారుమెట్ట జంక్షన్లో దుర్గాదేవి నవరాత్రులు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అల్లిపురం మెయిన్‌రోడ్డులో గల శ్రీ ధనశక్తి దుర్గాదేవి పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



రాచపోలమాంబ ఆలయంలో దుర్గమ్మను పూజలు నిర్వహిస్తున్న భక్తులు



సాగరగిరి కనకదుర్గమ్మ పూజలు చేస్తున్న భక్తులు

హెల్మెట్ ధరించకుంటే లైసెన్స్ రద్దు



రికార్డులు తనిఖీ చేస్తున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీలక్ష్మి, సిబ్బంది

అల్లిపురం: నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు టూటౌన్ పరిధిలో హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వాహన చోదకులుపై విస్తృతంగా ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేస్తున్నారు. దీంట్లో భాగంగా శనివారం అల్లిపురం బీఆర్ రెడ్డి జంక్షన్ నుంచి డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లే రహదారిలో తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వాహన చోదకులను ఆపి వారి రికార్డులు తనిఖీలు చేశారు. వారిలో చాలా మందికి డ్రైవింగ్ లైసెన్స్, సస్పెన్షన్‌క్ ఆర్టీవోకి సిఫార్సు చేసినట్లు ట్రాఫిక్ ఎస్.ఐ శ్రీలక్ష్మీ తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దని ఆమె వాహన చోదకులకు సూచించారు. అలాగా మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వకూడదని తల్లిదండ్రులకు సూచించారు.

వైద్య శిబిరానికి స్పందన

దాబాగార్డెన్స్: పాతనగరంలో గల క్రైస్ట్ చర్చి శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించింది. పలువురు క్రైస్తవులు, పేదలు వైద్య సేవలు పొందారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఎం .రాజశేఖర్, గైనకాలజిస్ట్ డాక్టర్ జి.శిరీష, నేత్ర వైద్యురాలు విష్ణు దీప్తి, దంత వైద్యురాలు డి.అనూష, ఫాస్టమేడ్ డయాగ్నస్టిక్స్ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ భవాని పాల్గొని వైద్య సేవలందించారు.

కేజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్‌పై ఉచిత పరీక్షలు



మాట్లాడుతున్న కేజీహెచ్ సూపరింటెండెంట్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో రొమ్ము క్యాన్సర్‌పై ఉచితంగా పరీక్షలు నిర్వహించనున్నట్టు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ తెలిపారు. 40 ఏళ్లు దాటిన మహిళలకు మామోగ్రామ్‌ల పరీక్షలు చేస్తున్నామన్నారు. రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన కార్యక్రమంలో శివానంద్ పాల్గొన్నారు. రోజుకు 10 నుంచి 15 మందికి పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు మాట్లాడుతూ రొమ్ము క్యాన్సర్ వ్యాధిపై మహిళల్లో అవగాహన చాలా ముఖ్యమన్నారు. కేజీహెచ్ మెడికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ శిల్ప, కేజీహెచ్ రేడియాలజీ విభాగాధిపతి డాక్టర్ బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.